# స్మృతి

రచన : శ్రీ రామకృష్ణ

ఆ రాత్రి - వెన్నెలరాత్రి - నిండు పున్నమిరాత్రి - జీవితంలో వచ్చే ఒక మధురమైన రాత్రి - జీవితపు లోతుల్ని తెలిసికోడానికి నాంది ప్రస్తావనచేసే రాత్రి- అదే నా శోభనపురాత్రి, ఘుమ ఘుమలు చిందే సెంట్ల వాసనతో, దూది పింజెల్లా వెదజల్లే కమ్మని అగరొత్తుల పొగలతో, మంచానికికట్టె మల్లెల గుభాళింపుతో, మీ జీవితాలకి అంథకారాన్ని ఇవ్వను అన్నట్టుగా కాంతిని వెదజల్లె 'ఫ్లోరోసెంటు' దీపంతో, దాని ప్రక్కనే ఓటమి నంగీకరిస్తూ వెలుగుతున్న 'డిమ్' లైట్‌తో, జవ్వని చెక్కిళ్లతో పోటీపడే 'ఏపిల్స్'తో గది చూడముచ్చటగా ఎంతో శోభాయమానంగ కనిపిస్తుంది.

ఏవో తీయని ఊహలలో తేలిపోతున్న మనసు, కలసుకంటున్న హృదయం తలుపు దగ్గర శబ్దమవడంతో ఈ లోకంలో వచ్చిపడ్డాయి. అమ్మలక్క లేవో హాస్యాలాడుతు 'సుచిత్ర'ని గదిలో పెట్టి వెళ్ళిపోయారు, 'సుచిత్ర' నిజంగ పేరుకి తగ్గట్టుగా సుచిత్రే. ఆమె కట్టుకొన్న ఆకు పచ్చని కంచిపట్టుచీర, దానిపై వేసికొన్న ఎర్రని బ్లౌజు ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయో, లేక ఆమె వాటి అందాన్ని ద్విగుణీకృతం చేస్తుందో తెలియటంలేదు. నుదుటని సింధూరం, ఆమె వర్చస్సుతో, పోటీపడలేక వెలవెల పోతున్నట్టుగా వుంది. మెడలో సన్నని గొలుసు, పచ్చని మంగళ సూత్రంతో వసంతంలో వనదేవతలా ఉన్న సుచిత్రని చూస్తు ఏవో లోకాల్లో, ఊహాగానాల్లో తేలిపోతున్న నన్ను-ఆమెచేసి 'మట్టె'లశబ్దం ఈ లోకానికి తెచ్చి పడేసాయ్.

ఊహా జగత్తునుంచి, వాస్తవానికొచ్చి ఆమెను దగ్గరగా తీసికొద్దామని లేచాను. నా మనసు అంత రాత్మ అంగీకరించక-అప్పుడప్పుడే చదలుపట్టిపోబోతున్న ఐదు సంవత్సరాల వెనుకటి జీవితపుటల్ని జాగ్రత్తగా త్రిప్పి చదువ నారంభించింది.

\+ \+ \+ \+

అప్పుడే నేను బి.ఎ పాసై రెండు గ్రీష్మాలైపోయాయి. ఉద్యోగంకోసం ఎంతో ప్రయత్నించాను. చెప్పు లరిగిపోయేట్టు ప్రతి ఆఫీస్ చుట్టుతిరిగాను. నా నమస్కారాలందుకొని ఆఫీసర్ లేడంటె కూడ అతిశయోక్తిలేదేమో, కొందరి ఆఫీసర్లకి నా శక్తికొద్ది కానుకలుకూడ ఇచ్చుకొన్నాను. అయినా దొరికే సమాధానం ఒకటే-'లేదు' ఈకాలంలో ప్రతివారు 'బిఏ.'నోయ్ మాకాలంలో నూడు .. అంటు ఒక యం. యల్. ఎ గారి వ్యాఖ్యానం మా చిన్నమ్మాయి పాస్ అయిందోయ్ 'బి. ఎ' అంటు నాన్నగార్కి ముఖపరిచయమున్న ఒక రిక్రూటింగ్ అధికారి గొప్ప... ఇలా ఎన్నో హేళనలే ఎదురయాయగాని, ఉద్యోగంమాత్రం ఎదురవలేదు. అప్పటికి విక్రమార్కుడిలా పట్టువదలక, ప్రాణం విసిగి ఒకనాడు రిక్రూటింగ్ ఆఫీస్‌కి వెళ్ళి మిలట్రీలో చేరుదామని-అబ్బే, అక్కడ కూడ చుక్కెదురే. బరువు నాలుగున్నర పౌన్లు తక్కువంటు అతి ధీనిగాపోయాడా ఆఫీసర్. ఇక ఈజన్మ కింతే అంటూ కాళ్ళీడ్చుకొంటువచ్చె నాకు, టేబిల్‌పై నాయడ్రస్‌తో ఉన్న ఉత్తరం ఆశ్చర్యంలో ముంచేసింది. నా ఉత్తరాలు వ్రాసేవారెవరబ్బా అనుకొంటు చదవడం ప్రారంభించాను. చదివి ఎంతో పొంగిపోయాను. అది మా మేనమామ వ్రాసింది 'కటక్'నుంచి అతను పనిచేస్తున్న డిపార్ట్‌మెంట్ లో ఏదో క్లార్క్ పోష్టుఖాళీగా వుంది రమ్మనమని.

ఎలా అయితేనేం భాషరాని రాష్ట్రంలో రెండు రోజులు తరువాత కాలుపెట్టి అతికష్టంమీద ఇల్లు కనుక్కోగలిగాను. ఆ మర్నాడు వెయ్యిదేముళ్లకి మొక్కుకొంటు బయల్దేరాను 'హెడ్ అఫ్ ది డిపార్ట్‌మెంట్'ని కలుసుకోడానికి-మేనమామతో సహా.

రూమ్‌లో అడుగుపెడుతూనే విష్ చెయ్యాలన్న విషయంకూడ మర్చిపోయి-ఆరూమ్, అందులో వున్న కాస్ట్లీ ఫర్నిచర్ చూసి ఎందుకో ఆ ముసలి ఆఫీసర్ అంటె ఈర్ష్య కలిగిందినాలో, ఎలా అయితేనేం విష్ చేసాననిపించుకొంటు ఆయన ఆఫర్‌చేసే సీట్లోకూర్చున్నాను. ఏవో చొప్పదంటు ప్రశ్నలువేస్తూ నా ప్రా

జాలుతో దేసాడిక పదిహేన్నిమిషాలు. తంతంత జరిగింతర్వాత, నాగార్డియన్ వైపుచూస్తు 'యూస్ మిష్టర్ రావ్, యు ఆర్ బిట్ లేట్, ఒన్ ఫెలో ఈజ్ సెలెక్టడ్ యండ్ నెక్ట్స ఛాన్సవిల్ బిగివెన్ టు యువర్ బోయ్'అంటు హుందాగ లేచాడు సీట్లోంచి - ఆ సమయంలో వాడ్ని నమిలి మింగేద్దామన్నంత కోపంవచ్చింది గాని- పేదవానికోపం పెదవికిచేటని పూరుకొన్నాను. ఎమైతేనేం ఆ ఒరిస్సారాష్ట్రంలో మరి ఉద్యోగస్తుడ్ని కాలేక పోయాను.

\+ + + +

ఖర్గ్‌పూర్‌లో మా అన్నయ్య (వరసకి)గారింట్లో రైల్వేవాళ్ల ధర్మమా అంటు స్థిరపడిపోయి అప్పుడే ఆరుమాసాలు దాటిపోయింది. సాఫ్‌గా పోతున్న జీవితంలో_ఒకనాడు ఎదురింటి అమ్మాయి నా దృష్టిలో పడి అలలు రేపింది. బహుసా 18 వసంతాలుంటాయేమో, కాలేజీలో చదువుతుంది. చామనఛాయ, అందమైన ముఖం, నాజూనకైన సన్నని శరీరం, శరీరానికి తగ్గ అవయవపుష్టి వన్నెంతో ఆకర్షించింది. చూపులతో ప్రారంభమయే మాపరిచయం, పత్రికలు ఒకర్నొకరు అడిగేంతవరకు పెరిగింది. నేను డ్యూటిమంచి వచ్చేసమయానికి అభిసారికలా చంకలో బిందెతో, ముఖాన్ని చిరునవ్వుతో నాకోసమె అన్నట్టుగా 'పైపు' దగ్గర నిలుచుండేది. ఆమెని చూడనిరోజు, ఆమెతో మాటాడని రోజు మనసెంతో బాధపడి, ఆమెకోసం పరితపించి పోయేది మనసు. ఆమెకోసమే జీవిస్తున్నానేమో అనిపించేది. కాలేజికని ఆమె, ఆఫీసుకని నేను బయల్దేర, ఇద్దరము దేనికీ వెళ్లక మేట్నీకి వెళ్లిన్నాము_ఆమెప్రక్కన కూర్చుని సినిమా చూస్తున్నంతసేపు స్వర్గాధిపత్యం వహించినంతగా సంబర పడిపోయేవాడ్ని.

ఆమె_అంటె 'ఉష'తో కలసి అక్కడికి మైలు దూరంలోవున్న బాలాజి మందిరానికి ప్రతి శనివారం వెళ్లి, జన్మ జన్మలకి మా యిద్దర్ని ఒకటిగా చెయ్యమంటు ప్రార్థించేవాల్లం. ఆ పరిసరాలలో, ఆ అందమైన జీడి తోటలో, అరుణకిరణాలు చిందే ఆ భానుని సంధ్య వెలుగులో ఒకర్నొకరు చూచుకొంటు_ఏవేవో మూగ భావలు చెప్పుకొంటు ఒకరో ఒకరం కలిసిపోయేవాల్లం ఇటువంటి అందమైన సాయంత్రా లెన్నో గడిచి పోయాయి.

ఆ మర్నాడు ఆదివారం. హౌరా వెల్దామని ప్రోగ్రాం వేసికొన్నాం నేను, ఉషకలిసి_అందుకే ఆ రోజు కాస్తా హుషారుగా బయల్దేరాను ఆఫీస్‌కి, మూడుగంటలకి సెక్షన్ హెడ్ నుంచి కబురొస్తె లోపలికెళ్లాను. వాడిపోయిన ముఖంతో తిరిగివస్తున్న నాచుట్టు ఏమిటి విశేషమంటు మూగారు మిత్రబృందం. ఏమని చెప్పను? ఎలా చెప్పను నీరకంగా, సీట్లో కూర్చొంటు టెలిగ్రాం ఆర్డర్ తీసి టేబిల్‌పై పడేసాను. దాన్ని చూచి, అదృష్టవంతుడవోయ్, మద్రాసు పోతున్నావు, అందులోను 'వైజాగ్' లాంటి టౌన్‌కి ట్రాన్సఫర్ - అంటున్నాడు ఫ్రెండ్ సురేష్. వాడికేం తెలుసు నాబాధ. ఎంత రిక్వెష్ట్‌చేసిన ఆమాట వినేదాతే లేకపోయాడక్కడ. నీరసంగా ఇంటికి చేరిన నన్ను చూచి ఎంతో కంగారు పడిపోయింది. ఉష. ఏం అలా వున్నావంటు లక్ష ప్రశ్నలు వేసింది. ఎలా చెప్పను సమాధానం? ఏమని చెప్పను? మౌనమే గతైంది ఆక్షణంలో. నిశ్శబ్దం కొన్ని నిముషాలు రాజ్యమేలిం తరువాత నీరసంగ జేబులోంచి ట్రాన్సఫర్ ఆర్డర్ తీసిచ్చాను. అంతే_ఇద్దరికి మాటలే కరువైపోయాయి. అలా ఎంతసేపు కూర్చున్నామో తెలియలేదు. ఎప్పుడూ కుషీగావుండే ఆమె కళ్లు ఆనాడెంతో విషాదంగ కనుపించాయి.

అలా అయితేనేం నేను బయల్దేరే రోజు రానే వచ్చింది. అందరితో చెప్పి ఉష వాళ్లింటికి వెళ్లాను చెప్పి వెల్దామని, గాని ఇంటిలో ఎక్కడ ఉష కనుపించలేదు. ఇంటిలోవాళ్లని అడిగే ధైర్యంలేక, వాళ్లతో చెప్పి స్టేషన్ చేరుకొన్నాను. కనీసం చెప్పి బయల్దేరడానికికూడ నోచుకోలేదే అని బాధపడుతూ.

స్టేషన్లో అడుగుపెడుతూనే నాకోసం వాడిన వదనంతో 'వైట్' చేస్తున్న ఉషని చూచి ఎంతో సంతోషించాను గాని ఆమెను ఎలా ఊరడించడమో బోధపడ్లేదు. ట్రైన్ అరగంట లేటని తెలిసి అలా 'కాంటిన్' లోకెల్లి కూర్చున్నాం. ఎన్నో మాటాడాలని, ఏవేవో చెప్పాలని వుర్విళ్ళూరుతున్న మనసుకి భాషే కరువై మూగపోయిందా సమయంలో.

'ఉషా! నెలరోజులు పోయింతర్వాత, తప్పక వస్తాను. ఏం బాధపడకు' అంటూ అనగలిగాను ఎలా అయితేనేం.

ఇంతలో వస్తున్నాను అని అరుస్తూ నిండు గర్భిణిగా వచ్చి ఆగింది హౌరా-మద్రాస్ మెయిల్. ఏవేవో చెప్పాలనుకొనే రెండు మనసులు ఏవి మాటాడుకోలేక, తీరని బాధతో మౌనంగా మూలిగాయ్. మాకోసం ఆగలేనట్టుగా 'కనేడియన్' ఇంజన్ కూత పెడుతు బయల్దేరింది. ఆ రొదలో 'నన్ను మరచిపోక' అన్న మాటలు అస్పష్టంగా వినిపించాయ్ ఉష నోటినుండి. కనుమరుగైనంతవరకు రుమాలు ఊపుతూనే నిలబడింది.

\+ + +

ఉషనుండి ఉత్తరాలు ఆగిపోయి మూడుమాసాలై పోయింది. కారణం తెలియక నాలో భయం, ఆందోళన రోజు రోజుకి ఎక్కువైపోతున్నాయి. అయినా వాళ్లింటికి డైరెక్టుగా ఉత్తరం వ్రాసే ధైర్యంలేక పోయింది. కాలేజి ఎడ్రస్‌కి ఎన్ని ఉత్తరాలు వ్రాసిన జవాబు వచ్చేదికాదు, కారణం తెలియక ఎంతో ఆందోళనపడేవాడ్ని. ఏవేవో పిచ్చి ఊహాలతో మనసు పాడైపోయేది. ఒక నాడు ఆఫీస్‌నుంచి రావడంతోనే ఖర్గపూర్ నుంచి అన్నయ్య వ్రాసిన ఉత్తరం కనుపించింది రూమ్‌లో. ఆతృతగా విప్పి చదవడం ప్రారంభించాను.

డియర్ బ్రదర్,

క్షేమం. నీవు వ్రాసిన ఉత్తరంలో ఉషనిగూర్చి వ్రాయమన్నావుకదూ? ఆమె పరీక్ష పోవడంతో వాళ్ల నాన్న ఆమెకు వివాహం నిశ్చయించాడు ఆమె మేనమామ కొడుకుతో-అంతే ఆరోజునుంచి ఆమె ఎప్పుడు ఏదో ఆలోచిస్తున్నట్టుగా, ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్టుగా, రోజులతరబడి తిండైన తినక, ఏదో వస్తువు పోగొట్టుకొన్నట్టుగా, ఎటో పిచ్చిదాన్లా చూస్తు అలా మంచంమీదే వుండేది. ఎంతోమంది డాక్టర్లకి చూపించారు. కాని ఏవరు బాగుచెయ్యలేకపోయారు. ఫలితం శూన్యం అయిపోయింది. ఆమె ఈలోకాన్ని విడిచిపెట్టి అప్పుడే పదిహేన్రోజులైపోయింది...అంతే ఆ తరువాత మరేముందో చదవలేక కల్లు తిరిగి అలా పడిపోయాను. తెలివివచ్చి చూచేసరికి హాస్పిటల్లో డాక్టర్ల మధ్య వున్నాను.

అప్పుడే ఉష చచ్చిపోయి సంవత్సరమైపోయింది. ఆమెలేని జీవితం మోడులా తయారైంది. జీవించక తప్పక జీవిస్తున్నానేమో అనిపిస్తుంది. ఉష జ్ఞాపకాలతో నిండిపోయిన మనసు ఆమె సాన్నిధ్యాన్నే కోరుతుంది. ఆమెదగ్గరకు వెళ్ళిపోదామని ఎన్నోసార్లు చచ్చిపోవాలనుకొన్నాను కాని మానవ సహజమైన దౌర్బల్యం అపని చెయ్యనిచ్చేదికాదు.

ఒకప్రక్క పెళ్ళికోసం అమ్మ, నాన్న ఎంత చెప్పిన ఏవో సాకులు చెప్పి తప్పించుకొంటుండేవాడ్ని. ఆఖరికి ఇంటికి ఆడదిక్కైన అమ్మ పోవడంతో-నాన్నగారి బలవంతంమీద తప్పనిసరిగా పెళ్ళిచేసికొన్నాను.

\+ + +

ఆ రాత్రే-ఆ వెన్నెల రాత్రే-ఆ నిండు పున్నమి రాత్రే ఉష స్థానంలో, సుచిత్రని చూడ్డంతో చీకటి రాత్రిగా-అమావాస్య రాత్రిగా-భరించలేని రాత్రిగా తయారైంది.

మన్నికకూ, నాణ్యమునకూ, సరైన కొలతకు

ఒలింపిక్ బనియన్లు

ప్రసిద్ధిచెందినది.

తయారించువారు

ఒలింపిక్ నిట్టింగ్ కంపెని, తిరుపూరు-4